# చిత్రగించవలెను

ఈ కథానిక 'COLLAGE' అనే నిర్మాణ పద్ధతిలో రాయబడింది. ఇది కథానికా శిల్ప విధానాల్లో ఒకటి. ప్రయోగ శిల్ప విధానాల్లో ఒకటి. ప్రయోగశిల్పం నమూనాల్లో ఒకటి. ఈ విధానంలో తెలుగులో తక్కువ కథలు వచ్చాయని- ఆడెపు లక్ష్మీపతి, బి.ఎస్.రాములుగార్లూ నేనూ సంభాషించుకున్నాం. నేనే *1980*ల్లో రెండు కథలు రాసినట్లు గుర్తు. ఇప్పుడు మళ్లీ రాద్దామనుకోగానే అనువైన వస్తువు దొరికింది. ఇది ఒక అధిక్షేప కథానిక. విలోమ కథానిక కూడా.

**- విహారి**

ముష్టికూడా పనికిరానిదాన్నయిపోయాను బాబూ... పనికిరాని దాన్నయి పోయాను. పాలిస్తున్నవారేం తక్కువ వారు కాదు. దేశ విదేశాల్లో పేరూ ప్రతిష్ఠా వున్న ఆర్థిక రాజకీయవేత్తలు.

ఇదిగో దినపత్రిక సారూ... చూడండి- అవిగో 'పతాక' శీర్షికలు!

'మన గ్రోత్‌రేట్ చాలా సంతృప్తికరంగా వుంది. మన మార్కెట్లు చాలా బలంగా బాగున్నై. (అచ్చుతప్పు కాబోలు- బలవంతంగా బాగున్నై!) ప్రభుత్వం తీరు వలన ఆర్థిక మాంద్యాన్ని అద్భుతంగా ఎదుర్కోగలిగాం. ఏ సమస్యా లేక ప్రతిపక్షాలు అనవసరమైన రాద్ధాంతాలు చేస్తున్నాయి!'

ఆత్మస్తుతీ, పరనిందా!!

●

సాయిబాబా టెంపుల్ పేవ్‌మెంట్ హక్కుల బాబులాంటి హక్కు- అంటే మాటలా? అమెరికా పేటెంట్ హక్కుల బాబులాంటి హక్కు.

"బలే పెద్ద మనిషివమ్మా... వద్దులే పద! నేనంత పనికిరానిదానిలా కనబడు తున్నానా? పది రూపాయల కాగితమిస్తే, పోన్లే అని మొహాన్న కొట్టనిదాన్ని. అదిగో... ఆ చివర కుష్టుదుంది- చూసుకో."

మొహం పగిలింది... గూబ గుయ్యమంది!

కుళ్ళిపోయింది దేహ భాగాలా? దేశ భాగాలా? అవును. జాగా జాగాకీ రేట్లుంటయ్... రేట్లు మారుతూనూ వుంటయ్!! భాగో... భాగో...

●

ఆరేళ్ల అనాథ బతుకుని చీకటి పేవ్‌మెంట్ మీద కుళ్ళబొడిచింది- అరవైఏళ్ల కామం.

ఓరి దుర్మార్గుడా! పిల్ల అంగీలో- కూరి, పారిపోతున్నావ్. ఇందుకా నా ఉనికి? ఇదా నా బతుకు? నీది దయా? ధర్మమా? రాస్కెల్!

న్యూసూ, వ్యూసూ చెలరేగిన్నై. రెచ్చిపోయిన్నై. ఇరవై నాలుగు గంటలూ, రణగొణ ధ్వనీ, రాళ్ల వానా! మేకప్ మొహాల చర్చలే చర్చలు!

అంతా గుడిపూడి జంగాలు!

మర్నాటికి కొత్త కథ కోసం వేట... పబ్‌ల బాట! నా సంగతేవిటి?!

●

గల్లీలో పండగ దందాలూ, చందాలూ!

మాల్స్ నుంచి కార్పొరేట్స్ దాకా బలవంతపు పార్టీ ఫండ్స్!

నగదు బాబూ, నగదు! అక్కడా నాకు ఉనికీ లేదు, ఊసూ లేదు. తోసెయ్, పక్కకి తోసెయ్, నూసెన్స్! లెఖ్ఖ కష్టం!

కాదన్నవాడి నోరూ, కారూ ఖాళాస్!

ఆరుకోట్ల ఆఫీస్ బిల్డింగ్ ఆరు నిముషాల్లో శ్మాష్! చూసేవాడికి ఉచిత వినోదం, రక్షకభటుడికి భయం, భయం...

'నేను డ్యూటీలో లేను' ...తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ!

●

"మా అమ్మ ఇచ్చింది సారూ! చాలా కష్టపడి కూలిచేసి తెచ్చింది సారూ... తీసుకోండి. ప్లీజ్... నాకు నోట్‌బుక్ చాలా అవసరం సార్! ఇవ్వాళ తీసుకుపోకబోతే క్లాస్‌రూమ్ గోడవారగా రెండుగంటలు నిలబడాలని సార్. ప్లీజ్ సార్... ప్లీజ్!"

"అరెరె... ఏమిరా ఈ నస, సతాయింపు? కుదర్దు. 'లేదు పోరా...' అంటే 'కాదు, తీసుకో'మంటావ్? ఛల్... ఛల్..."

శ్రీ మహాలక్ష్మి స్టేషనరీ షాప్ యజమాని! సరస్వతి కాగితాల్తో చిల్లర పోగేసిన కంత్రీ! రూపాయికొకటి చొప్పున విడివిడిగా అమ్మేస్తున్నాడు... దేశమాత (పటం)ని!

నేను మాత్రం వాడికీ కానిదాన్నయిపోయాను!

●

"కో లీకో టిక్కెట్టు!"

"దీన్నెక్కడ్నుంచీ తెచ్చావ్? చిల్లరదియ్!"

"లేదు సారూ..."

"దిగవయ్యా... దిగు... పొద్దున్నే వెధవ గొడవ!" ఈలమీద ఈల.

బస్ ఆగింది. ఆసామీ దిగులు దిగులుగా దిగిపోయాడు. ఇదీ వరుస!

●

"రేపివ్వండి సార్... ఫర్వాలేదు!"

పాలబూత్ యజమాని- చేతిలోకి కూడా తీసుకోలేదు. చూసీ చూడంగానే మొహం తిప్పుకున్నాడు. అవును...

ఎందుకూ పనికిరానిదాన్నయిపోయాను బాబూ... పనికిరానిదాన్నయిపోయాను!

●

పండ్ల బండి చుట్టూరా వున్నారు కొనేవాళ్ళు...

ఆడా, మగా బేరాలు సాగుతున్నై. కొందరికి జవాబు వస్తోంది. కొందరికి విసుగూ, విసురూ... ఎదురుదెబ్బలై తగులుతున్నై.

"నీది కొనే బేరం కాదులే, పోవమ్మా!" అతని మొహంలో చిరాకు.

ఆమె మొహం చిన్నబోయింది. నిమ్మళంగా కదిలి వెళ్ళిపోయింది.

"రెండు అరటి పళ్ళివ్వండి... ఇక్కడే తింటా!" ఇచ్చాడు. ఇతనూ డబ్బిచ్చాడు. బండి అతని చూపుల్లో ఈటె- "దీన్నెక్కడ తెచ్చావ్ భాయ్? నహీ చలేగా, ఔర్ ఏక్ దో!"

క్షణంసేపు విభ్రమం! మరో క్షణంసేపు నిశ్శబ్దం!!

ఇతని మొహం మీది 'ఎందుకనీ?' ప్రశ్నని పెదవులు ప్రసారం చేసినై.

"అరెరె... భాయ్- నహీ చలేగా... బస్! బేరాల టైమ్... మీరు వెళ్ళండి!" విసుగుదలని అమ్మకపు నైపుణ్యంలో వాదిగించాడు. పక్కనున్న పెద్దమ్మ అందుకుంది-

"తీసుకో బాబూ, పండ్లివ్వు! ఇక్కడే తింటానంటున్నాడు. పాపం- ఆకలో, ఏమో?!"

"మీకేం కావాలో చెప్పండి!" 'ఆయన సంగతి నీకెందుకమ్మా?' అనే అర్థం ఇమిడే వుంది. ఆమె ఏమీ కొనకుండానే పక్కకి జారుకుంది.

ఇతను బండిని చూశాడు. బండివాడినీ చూశాడు. బండి చుట్టూవున్న మనుషుల్ని చూశాడు. దిక్కులు చూశాడు. కడకు పక్కకు నడిచాడు.

ఆకలి... నిరాశ... అసలే విరిగిపోయిన పాలు. అందులో నూనె చుక్కలు! వికారమైన కదలిక. ఒక సంఘం అవ్యక్త నిరసన- 'ఛీ... ఛా...'లతో ముద్దకట్టిపోయింది.

●

ఆకుకూరల బండి... రోజూ కొనుగోలు చేసే సరుకు!

అమ్మకందారు పేరు 'చండి!' ఎరుగున్న మొహమే!

పలకరింపు నవ్వు. భావ ప్రసరణం జరిగిపోయింది. బేరం సాగింది. పనికిరాని మాటల్లో పనికిరాని జ్ఞానం. లోకరీతి, రివాజూ- లోకాభిరామాయణం! మెంతికూర కట్టలు చేతులు మారాయి. ఇచ్చింది ఇంటావిడ. చూసింది చండి. చండి కళ్ళల్లో పరీక్ష.

చెప్పాను కదా- ఎవ్వరికీ పనికిరానిదాన్ని. చండి అసలే ప్రాసయుక్త యువతి- మొండి! వద్దే వద్దంది! "నే గుర్తుంచుకుంటాన్లెండి. రేపు తీసుకుంటా" చర్చ... వాదం... వివాదం... మాట తీస్తే మాట!

"పో... అయితే... పో..!" ఇంటావిడ ఉపసంహారం. బండి తోసుకుంటూ చండి, ముందుకు. తనను తాను తిట్టుకుంటూ ఆమె, ఇంట్లోకి! గాలి దుర్వాసనని మోసుకొస్తోంది.

●

అరవై ఏళ్ల విశ్రాంత ఆచార్యుడు...

ఇరవైయ్యేళ్ల న్యూస్‌పేపర్ స్టాల్ యువకుడు. చౌరవగా పేపర్ కదిలింది.

యువకుడు తీసుకోనంటున్నాడు. ఆచార్యుడు తీసుకోవలసిందేనంటున్నాడు.

వాగ్వాదం!

పోలీస్ కంప్లెయింట్ ఇస్తానన్నది 'పరిణత' మేధ!!

"పోండి సార్... మీ యిష్టమొచ్చిన చోట చెప్పుకోండి!" అనేసింది వయసువాడి.

పేపర్ యథాస్థానం ప్రవేశించింది!

ఆవేశం పైకీ, కిందికీ! చూచువారలకు చూడముచ్చట!

పతాక శీర్షికని చదువుకున్నె ఆచార్యుని చూపులు-

"అమ్మ అంటే బూతు మాట. తెలుగుపై నిషేధం!"

"ఏమయిపోతోంది మాతృభాష?" వివరాలు వేరే పేజీలోకి వెళ్లాయి. ఆచార్యులవారి కడుపు మరీ మండింది. మనసు మరీ మరీ రగిలిపోయింది. ఎంతెంత మార్పు? మార్పుల కోసం, మార్కుల కోసం వాచకాల్లో ఎన్నెన్ని నీచకాలు? వీధి(న)బడి(ంది)

తెలుగు- తెగులు. 'యాగీ' మిగిలింది!

కార్పొరేట్ విద్య బోగీకి కోట్లు, కోట్లు!!

●

సమాజానికి గుడ్లు చేతికొచ్చినై.

కొంచెం కొంచెం వాంతులూ, కొంచెం మించిన బేదులూ! మనిషి బుఱ్ఱలో మకిలీ, మంది తల, ఊపూ!

మొన్నా, నిన్నా, నేడూ, రేపూ, 'కాలం ప్రవాహశీలం' కలది.., కలవాడు.., ఎట్‌సెట్రా... గలగల! కలలు... కలలు... "కథ మిగిలింది, కల చెదిరింది!"

నిజం... నిజం... భయం... భయం...

ఇంతకుమించీ ఆలోచిస్తూనే వుండండి... నా గురించి! ముష్టికిక్కూడా పనికిరాని దాన్నయిపోయాను బాబూ... పనికిరానిదాన్నయిపోయాను!

ఏమో- మీలాగే...

నాదీ వానపాము బతుకైపోయిందా? బతుక్కి మరి పెద్ద పెద్ద పోలికలు నప్పవు!

అరెరె... స్టాప్- 'ప్రెస్!' ఒక్కక్షణం... అటు చూడండి...

ఆ బతుకు ముందు పేవ్‌మెంట్ మీద చెక్కబోర్డు!

నాకు స్వాగతం... సాదరపూర్వక ఆహ్వానం...

'ఇచట ఐదు రూపాయలనోట్లు తీసుకోబడును!'

అనూహ్య పరిణామంగా అదిరిపోకండి బాబూ...

వ్యాపారం... వ్యాపారం... మారకపు విలువలో ఏ మంత్రమూ, మర్మమూ లేవుట. నా కుంటినడక విలువ- నాలుగు రూపాయలట!

మొహం విలువ ఎప్పుడో మాడిపోయిందిట!

ఛీ... ఛీ... సిగ్గు లేదు! ఎవరికీ?!!

●

' చినుకు ' మాసపత్రిక ... జనవరి ' 2011 సంచికలో ప్రచురితమైన కథ